# వాత్సల్యం



ఆడపిల్లల బడిలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్న గౌరి ఇంట్లో హాల్లో కూర్చుని బడిపిల్లల వ్యాసాలు దిద్దుతూండగా, నగర సంగీత పాఠశాల స్వయంగా నడుపుతున్న ఆమె భర్త శేఖరం వీణమీద ఒక కొత్త బాణీ పలికిస్తూ కూర్చున్నాడు తన గదిలో. "ఎప్పుడూ టింగు టింగు తీగెలు మీటుతూ కూర్చోడమే గాని పిల్లాడి చదువైనా కనుక్కోరు'' అనిపించి చేస్తున్న పని ఆపుచేసి భర్తవున్న గదివైపు మెటికలు విరిచింది గౌరి. కాని అంతట్లోనే ఆమెకు తట్టింది. —తాను కూడా అల్లాగ బాధ్యత లేకుండా ప్రవర్తిస్తే పిల్లాడెందుకైనా నాపనికి వస్తాడా? అని. ఎనిమిదేళ్ళవాడూ, ఏకైక పుత్రుడూ అయిన శౌరిని లెక్కల పుస్తకం, పలక పట్టుకు రమ్మంది. శౌరి వచ్చాక కొన్ని గుణకారాలు చేయించింది; సరిగానే చేశాడు. భాగారం ఒకటి పలకమీద వేసియిచ్చి చేయమంది. తనకు ప్రయివేట్ మాస్టర్ నేర్ప లేదన్నాడు శౌరి. "వా డొక అప్రయోజకుడు. భాగారాలైనా రాకుండా వచ్చే ఏడు నాల్గో క్లాసులో ఎల్లాగ జేర్పించడం?'' విసుక్కుంది గౌరి. తర్వాత స్వయంగా చేసి చూపించింది భాగారం ఎల్లా చెయ్యాలో. శౌరికి అర్థమయింది. తర్వాత తల్లి మరో భాగారం యిచ్చి చేయమంటూనే తప్పు లేకుండా చేసేశాడు. మురిసిపోయింది గౌరి. అంటే తుఫాను వచ్చేస్తోందన్నమాట; శౌరికి తెలుసు; బిక్కు బిక్కు చూశాడు. గౌరి అమాంతంగా శౌరిని ఎత్తుకుని నలిపేసి ముద్దులాడింది: "నా తండ్రి ఎంత తెలివైనవాడో'' అంటూ. పిల్లాడికి ఆయాసం వచ్చేలా ముద్దులాడి క్రిందికి దింపింది. కందిన బుగ్గలు తుడుచుకుంటూ "అమ్మకు ఏమి వచ్చినా కష్టమే'' అనుకున్నాడు శౌరి. చదువు చెప్పడం చాలించి తిరిగి వ్యాసాలు దిద్దడంలో పడింది గౌరి.

త్వరగా ఆ పని తెముల్చుకుని లేచి ఆమె పక్క గదిలోకి వెడుతూనే గదిలో ఓ మూల నక్కి కూర్చున్న శౌరికి బుగ్గలు ఎత్తుగా వుండడం చూసింది. శౌరి నోరు మెదపడం మానేసి తల్లికేసి బిక్కు బిక్కు చూశాడు. నోరు సోదాచేసి కనుక్కుందామె శౌరి మిఠాయి వుండలు తింటున్నాడని. అతని పుస్తకాల సంచీలో చేయి పెడుతూనే ఆమెకు మరో రెండు మిఠాయి వుండలు దొరికాయి. ఎక్కడివని అడిగింది.

*కథలంటే పిల్లలు చెవికోసుకుంటారు. శౌరికూడా అంతే. పెద్దవాళ్ళు ఆలా కాదు. మనసులో ఏవో ఆలోచనలు పెట్టుకుని కథలు చెబుతారు. వాటి పరిణామాలకు ఎవరు బాధ్యులు ?*

"బొమ్మగా రిచ్చారు" అన్నాడు శౌరి కొడుతుందేమోనని కొంచెం ఒదుగుతూ.

"ఇల్లాంటి వెధవ గడ్డి తిను ఈ సారి! చెప్తాను" అని మిఠాయి వుండల్ని చెత్త బుట్టలోకి గిరా టెట్టింది. వంటింటి గుమ్మంలో నిలబడి అంతా చూస్తూనేవుంది ముసలావిడ; ఆమె మనసు చివుక్కుమంది.

"నావీ మిఠాయి వుండలు.....నాకు బొమ్మ గారిచ్చారు'' అంటూ మారాం చేస్తున్న శౌరిని ఒక్క మొట్టికాయ వేసింది గౌరి. "నే నేదైనా వాడిచేతిలో పెడితే నువ్వు ఇంత రాద్ధాంతం చెయ్యడం బాగుండదమ్మాయీ''. కూకలేసింది అత్తగారు.

"వాడి ఆరోగ్యం సంగతి కూడా ఆలోచించాలిగా" అంది ముక్కుపుటాలు పెద్ద చేస్తూ గౌరి.

"ఇప్పుడేమి వచ్చిందని వాడికి?'' అడిగింది అత్తగారు.

"ఏదీ రాకుండానే మనం జాగ్రత పడాలి. వచ్చాక మనం చేసే దేముంటుంది." రుసరుస లాడింది గౌరి.

"ఔను. నాకేం తెలుస్తుంది ఆ జాగ్రత ! నే నెప్పుడైనా పిల్లల్ని కన్నానా, పెంచానా!'' అంది ముసలావిడ వెటకారంగా.

"మీ అండ చూసుకునే వాడు మరీ పేట్రేగి పోతున్నాడు. ఎదిరించి జవాబు చెప్పే



దాకా వస్తున్నాడు" అంది గౌరి.

"నీకు స్కూలుకు టైం అయిందేమో' అన్నాడు అంతా వింటున్న శేఖరం గదిలోంచి బయటికి వచ్చి.

భర్తకేసి చురచుర చూసి గోడనవున్న క్యాలెండరు వైపు వేలెట్టి సూచిస్తూ ఆవేళ ఏం వారమో కొంచెం గుర్తు తెచ్చుకోమంది గౌరి.

"ఈవేళ ఆదివారం నాన్నగారూ., బామ్మ గారు చెప్పారు" అన్నాడు శౌరి.


"ఓహో! అయితే మీ అమ్మ కీ వేళ బోలెడు తీరుబడి" అన్నాడు శేఖరం—అయితే యింకా రోజున యింట్లో ఎవరినీ బతక

## వాత్సల్యం

నీయదని ధ్వనించేలా.

సరిగా అప్పుడే మేడ మెట్లెక్కి వచ్చిన ఓ కుక్క యింట్లో అడుగుపెడుతూ ఆమెను చూసి తోక ఆడించింది. గౌరికి ఒళ్ళు మండింది. దగ్గరలోనేవున్న గొడుగు చురుగ్గా చేత బుచ్చుకుని ఒక్క అంగలో వెళ్ళి ఊతంగా మోదింది. కాలు విరిగిపోయిందో ఏమో! 'కుయ్యో మొయ్యో' మంటూ అది కా లెగరేసు కుంటూ దౌడు తీసింది.

"అయ్యో, అయ్యో! నా గొడుగది. విరిగి







## పూవు మీ అదృష్టం చెప్పగలదు

ని భవిష్యత్తులో ఏమి జరుగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యన గురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన విరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయితు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థ యాత్రలు. వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, అకస్మాతు ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి.చార్జీలు ప్రత్యేకం. దుష గ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (A. W. 13) Jullunder City.**


పోతుంది" అన్నాడు శేఖరం.

"వెధవ గొడుగు" అన్నట్లు ఓ సారి దాన్ని ఝళిపించి అక్కడే పడేసి భర్తవైపు ఒక్క వాడి చూపు చూసింది తారెత్తిపోయేలా. కత్తి యుద్ధంలో అతి మెలకువగా వేటు తప్పించుకుంటున్న యోధుడికి మల్లే శేఖరం రెండడుగులు చురుగ్గా పక్కకు వేశాడు ఆమె దృక్పథంనుంచి తప్పుకుంటున్నట్లు. కుక్కను కొట్టినప్పుడు వదులుగా జారిన పమిటను యథా స్థానంలోకి విసిరి, కొప్పు విడిపోయి విరియబారిన కేశాల్ని చురుగ్గా ముడులు తిప్పుతూ నడినెత్తిని గుడికట్టులా మునిపత్నికి మల్లె కొప్పు కూర్చుకుని విసవిసలోపలికి చక్కా బోయింది గౌరి. ఓ మూల కుక్క నడ్డి విర గేస్తూంటే ముసలావిడ ఎందుకో తన వీపు సవరించుకోడం మొదలెట్టింది. అప్పుడే ఆమె మరో కొడుకు దగ్గరికి ప్రయాణం కట్టే సింది. గౌరి లోపలికి వెడుతూనే "చిన్నాడిని చూసి చాలా రోజులయిందిరా, అబ్బాయీ. వాడిదగ్గ రెప్పుడూ వాల్గు రోజు లుండడం పడటంల్లేదు. మళ్ళీ వస్తా" అంది చేతి సంచీ చేత బట్టుకుని. తల్లి ఎందుకు వెళ్ళిపోతోందో తెలుసుకోలేనంత దద్దమ్మ కాడు శేఖరం. మనుమడిమీద ప్రేమకొద్దీ ఆమె మిఠాయి వుండ వాడి చేతిలో పెడితే దానికింత గొడవ జరిగింది. గౌరి స్వభావమే అంత. ఆమె పక్క బంధువులుగాని, తనపక్క వాళ్ళుగాని ఎప్పుడూ తమ యింటికి రారు. ఒకవేళ వచ్చినా రెండు రోజులు కూడా నిలవలేరు. వచ్చిన దగ్గరి మంచీ కాలుతున్న పెనంమీద కాళ్ళు పెట్టుకుని నిల్చున్నట్లు తొందరపడిపోతారు వెళ్ళిపోడానికి. ఒక్క యింట్లోనే కాదు. ఆమె స్వభావం స్కూల్లో కూడా అంతేనని విన్నాడు శేఖరం. ఆమె పాఠం చెప్పడం ఎప్పుడైపోతుందా, ఎప్పుడు గంట కొట్టేస్తారా అని ముళ్ల మీద కూర్చున్నట్లు తహతహ లాడిపోతా రుట పిల్లలు. బడిపిల్లలమీద ఆమె ప్రతా పాలు తరచు శేఖరం చెవిని పడుతూనే వుంటాయి. ఆమె కాఠిన్యానికి, క్రూరత్వానికి పెట్టినది పేరనే భావం అతనిలో చాలా కాలం క్రితమే ఏర్పడిపోయింది. తల్లి ప్రయాణం కడుతూంటే శేఖరం ఏమీ అనలేక పోయాడు. శౌరి కూడా బామ్మతో ప్రయాణం కట్టాడు. అది కనిపెట్టిన గౌరి "డొక్క చీరేస్తా. ఇంటికి ఎవరొస్తే వాళ్ళతో ప్రయాణం కట్టడం కొత్తగా నేరుస్తున్నావా" అంది కళ్ళెర్రజేసి శౌరి వెడతానని పేచీ పెడు తూంటే రెండు వాయించింది. "ఊరికే దెబ్బలు తినకు నాయనా" అని సలహా యిచ్చి ముసలావిడ బయల్దేరింది.

ఆమె వీధిలోకి వచ్చి రిక్షా ఎక్కుతూంటే అప్పుడే యింకో రిక్షా వచ్చి అక్కడ ఆగింది. గౌరి అన్నగారు సేతుమాధవరావు క్రిందికి

దిగి నెత్తిమీదవున్న ఈకల హ్యాట్ కొంచెం ఎత్తి పట్టుకుంటూ మర్యాద సూచకంగా తల వంచాడు ముసలావిడిని చూస్తూనే. "బాగు న్నావా బాబూ" అంది ముసలావిడ రిక్షా బయల్దేరుతూంటే. " ! ? నిక్షేపంలా" అన్నట్లు ఒక్క చిరునవ్వు పారేశాడు సేతు మాధవరావు. సర్వసాధారణంగా అతన్ని అందరూ "సేతూ" అని పిలవడం మామూలు. సేతుకు సుమారు నలభై ఏళ్ళయినా వుంటాయి. బొజ్జా అదీ, మనిషి అసలే స్థూలకాయుడు. దానికి తోడు బొత్తాలు పెట్టని కోటు, అందులోంచి కనిపించే చొక్కామీద తొడుక్కున్న స్వెట్టర్, బొజ్జమీంచి లాగు జారిపోకుండా పెట్టుకున్న బెల్టు, బూరిబుగ్గ లేసుకుని హాస్యగాడిలా నవ్వుతూండే మొహం, నెత్తిమీద ఈకల హ్యాట్—ఆ అవతారం చూసి ఎవరూ ఏ సంగతీ అతనితో సీరియస్‌గా చెప్పవలవి కానట్లుంటాడు మనిషి. ముసలావిడ ఎక్కిన రిక్షా బయల్దేరాక టోపీ సర్దుకుని సేతు ఆవరణ గేటుదగ్గరికి వెడుతూంటే గౌరి చక్కా వచ్చింది యింట్లోంచి. ఆమెను చూస్తూనే "హలో చెల్లాయి! ఏమిటి సంగతి" అనిపోతున్న ముసలావిడ రిక్షావైపు సరసంగా హ్యాట్ వూపుతూ "అత్తమ్మకు సెండాఫ్" అన్నాడు నవ్వుతూ. "ఒరే సేతూ" అంటూ ఆమె కోపగించబోయింది గాని సేతు నవ్వు మొహం ముందు ఆమె కోపం వెలవెలబోయింది., "ఎక్కడ్నుంచి రావడం" అని అడిగింది ఓ మూల వెళ్ళిపోవాలన్న తొందర వ్యక్తం అవుతూండగా.

"మన సంగతేనా! ప్రస్తుతం బెజవాడనుంచే లేగాని చెల్లాయి. నిజానికి ఆంధ్రరాష్ట్రం ఓ పెడంతా చుట్టివచ్చాను మా డ్రామా కంపెనీతో. విజయనగరం, విశాఖపట్నం, తుని" అని వేళ్ళు ముడిచి లెక్కిస్తూన్న సేతుతో "ఇదిగో సేతూ, అవన్నీ వినడానికి నా కిప్పుడు తీరిక లేదు. నేను వెళ్ళాలి" అంటూ బయల్దేరింది గౌరి.

"సరేలే చెల్లాయి, నువ్వు పని చూసుకురా. తర్వాత చెప్తాలే నీకు మేము వేంచేసిన వూళ్ళన్నీ మ్యాపులో చూపించి" అన్నాడు సేతు యింట్లోకి దారితీస్తూ.

"ఎక్కడినుంచి వచ్చాడో ఎరక్కపోయి అడిగానే" అనుకుంటూ గౌరి ఓసారి వెనుదిరిగి జూచి ముందుకు సాగింది. సేతు సంగతి తల్చుకుంటూంటే గౌరికి కోపంకంటె ఎక్కువ జాలివేస్తుంది. మొదటినుంచీ అల్లరి చిల్లరిగా డ్రామా కంపెనీలతో తిరిగి చదువు పాడుచేసుకున్నాడు. ఇప్పుడూ అంతే; ఆ కంపెనీలతో ఊరూరూ తిరుగుతూంటాడు. వాళ్ళైనా సేతుకు ముట్ట జెబుతారో లేదో తెలియదు గాని గౌరికి తెలిసున్నదల్లా ఒకటే. రెండేసి మూడేసి నెల్లకోసారి హఠాత్తుగా వచ్చి కనబడుతూంటాడు. వచ్చినప్పుడల్లా వీలయితే



వినాయకుడు (తిరుకొళివి)

ఫోటో—ఎన్. రామకృష్ణ (మాయురమ్)

ఆమెను బెదిరించి పాతికో, పరకో పట్టుకుపోతూంటాడు. ఈసారి మాత్రం ఏమీ ఈయకూడ దనుకుంది. అల్లాంటి వాడికి ఎక్కడైనా ఉద్యోగం వేయించడం కూడా భయమే! ఓసారి ఆమె ఒత్తిడి చేసినమీదట శేఖరం ఎరిగున్నవాళ్ళతో చెప్పి ఒక సహకార సంఘంలో సేతుకు ఉద్యోగం యిప్పిస్తే, అందిన మట్టుకు డబ్బు కాజేసి ఆరునెల్లపాటు ఐపులేడు మనిషి; తల కొట్టేసినట్లయింది. ఆ దండుగ యిచ్చుకోడం తమ నెత్తినే పడింది. "నయమే యింకా యిల్లాంటివాడు పెళ్ళి పెడాకులు చేసుకున్నాడు కాడు. వాళ్ళెంత ఏడ్చేవాళ్ళో" అనుకుంది గౌరి. కాని సేతు చెడిపోతున్నాడనే చింత ఆమెకు వుంది. కాని ఒకసారి అల్లాగయ్యాక ఎల్లా అడుగుతుంది భర్తను సేతుకు మరెక్కడైనా ఉద్యోగం ప్రయత్నించమని! ఆయ నంతటాయన అర్థం చేసుకోవాలి గాని. అదీగాక తాను అడగాలా! ఓసారి తప్పుచేస్తే మాత్రం తెలియనివాడు, అంతట్లోకే, వాడెందుకూ పనికి రాకుండా పాడైపోతున్నా ఏమీ పట్టించకోకుండా కూర్చోడం ఏం బాగుంది భర్త! అదే ఆలోచిస్తూ నడుస్తోంది గౌరి. తనకు జీతం పెరిగిన సంతోషంలో ఆమె అదే సాయంత్రం స్నేహితురాండ్రకు ఒక విందు చేయబోతోంది. ఒక స్నేహితురాలిని రమ్మని చెప్పడం మరిచిన గౌరి ఆమెను పిలవడానికనే బయల్దేరింది.

సేతును చూస్తూనే "మామయ్య వచ్చాడు" అంటూ ఎగిరి గంతేశాడు శౌరి.

# వాత్సల్యం

కిటికీ దగ్గర నిలబడి గొడుగు ఎక్కడ దెబ్బతిందో తిప్పి తిప్పి చూసుకుంటున్న **శేఖరం** సేతువైపు తిరిగి " ఓహో బావా ఎక్కడినుంచి" అన్నాడు.

"అయితే మనకు వస్తున్న కీర్తి పత్రికల్లో చూడటం లేనట్లుందే మీరెవరూ! మొన్న రాత్రే "శ్రీ కృష్ణతులాభారం" ఆడాం బెజవాడలో. సరాసరి అక్కడినుంచే వస్తున్నాను. ఏమి 'ఎప్రీసియేషన్' అనుకున్నావు బావా! తప్పెట్లతోనూ వన్స్‌మోర్లతోనూ హాలు ఎగిరిపోయిం దనుకో! మనం కృష్ణుడు వేశాం."

"చంపేశావ్. కృష్ణుడే!" అన్నాడు శేఖరం ఇంకా గొడుగు చూసుకుంటూనే.

"ఊచలేవైనా విరిగిపోయాయా బావా అల్లా చూస్తున్నావు గొడుగు."

"ఊచలు కాదోయ్. కామకే వచ్చాయి తిప్పలు. చిట్లిపోయింది."

"కర్రది కదూ మరి!" అన్నాడు సేతు "విరిగిపోవడం సమంజసమే" అన్నట్లు.

"ఇనపదైనా అంతే అవునేమో!" అన్నాడు శేఖరం భావగర్భితంగా.

సేతు గతుక్కు మన్నాడు. అయితే ఆ గొడుగు విరగడానికి చెల్లాయికి ఏదో సంబంధం వుండితీరా లనుకున్నాడు.

మామయ్యను చూస్తూనే ముందు కథలు జ్ఞాపకం వస్తాయి శౌరికి. "అమ్మ దొంగా! అప్పుడొచ్చినప్పుడు కథ మళ్ళీ సగంచెప్పి పారిపోయావు కదూ ఈసారి వదిలిపెట్టను" అన్నాడు.

"ఓ! ఆ కథ" అన్నాడు సేతు జ్ఞాపకం తెచ్చుకుని. "సాయంత్రం చెప్తా"నని నమ్మించాడు శౌరిని. వచ్చినప్పుడల్లా కొంచెం కొంచెం చొప్పున రెండేళ్ళనుంచీ కథ చెప్పుకుంటూ వస్తున్నాడు శౌరికి. అదొక గయ్యాళి గంప కథ. క్రితంసారి వచ్చినప్పుడు ఆమె మొగుడి ముక్కు చెవులు కోసేసిందని చెప్పాడు. పోయినసారి మరి గౌరి పది రూపాయలైనా ఈయలేదుగా! కాని ఆమె యిచ్చిన సందర్భాలూ వున్నాయి. అల్లాంటప్పుడు అతని కథ కూడా అందుకు తగినట్టే వుంటుంది.

"ఆమె కోపం వస్తే మొగుడ్ని చీపురు కట్ట తిరగేసి కొడుతుందిగాని పాపం ఆమెకు మళ్ళీ అతనంటే యిష్టమే రోయ్. ఓరోజున అతనికి అడక్కుండానే జిలేబీ చేసిపెట్టింది! జేబు రుమాలుకు అత్తరు, తలకు సెంటునూనె రాసింది. ఇంకా పోతే కోటు కాలరుకు గులాబీ పువ్వు కూడా పెట్టిందిరోయ్"—అదీ అప్పుడుండే అతని కథ ధోరణి. సేతు అంతకు ముందు కూడా అనేక కథలు చెప్పాడు శౌరికి. వింటూంటే శౌరికి వెంట్రుకలు నిక్కపొడిచేవి. అనుకోకుండా గుండె దడ దడలాడించి హఠాత్తుగా ఆగిపోతాయి అతని కథలు.

" ఓరోజున ఓకుక్క ఓపెద్ద పీపాలోకి దూకింది" అని మొదలెట్టాడు ఓసారి.

"అప్పుడేమైంది'' అని అడిగాడు శౌరి.

"అప్పుడు పీపాకు కోపం వచ్చి తిరగబడింది. మూతిపక్క నేలమీద ఆని నిల్చిపోయింది. కుయ్యో మొయ్యో మంటూ పాపం కుక్క అందులోనే వుండిపోయింది."

"అయ్యో! అయ్యో! ఎవరూ పాపం దాన్ని *బయటికి తీయలేదూ" అడిగాడు శౌరి.*

"అబ్బే! ఎంతమంది పట్టుకుని ఎత్తినా ఆ పీపా కదల్లేద''ని చెప్పేసి ఎక్కడికో చక్కాబోయాడు సేతు. అల్లాంటి కథలు చెప్పి వెళ్ళిపోయే సేతు మళ్ళీ ఏ నాలుగు నెల్లకో వచ్చినా, పాత కథ యింకా బుర్రలో ఆడుతూనే వుండేది శౌరికి. సాయంత్రం ఎప్పుడవుతుందా, మామయ్య కథ ఎప్పుడు చెప్తాడా అని కాసుక్కూర్చున్నాడు శౌరి.

భోజనం కానిచ్చి కొంచెంసేపు విశ్రమించాడు సేతు. ఇంతలో శౌరి ప్రయివేటు మాస్టారు వచ్చాడు. మొహం చిట్లించుకుని శౌరి పుస్తకాల సంచీ పట్టుకుని హాల్లోకి వెళ్ళాడు. ఒక పొడుం పట్టుపీల్చుకుని మాస్టారు తెలుగు డిక్టేషను మొదలెట్టాడు. శౌరి పలక మీద వ్రాస్తున్నాడు. కాని అతనిలో ఏ కోశాన్నీ ఉత్సాహం అన్నది లేదు. వ్రాయడం కాగానే మాస్టారు చేతికి పలక అందించి ఆయనవైపు ఒక యమకింకరుడిని చూసినట్లు చూస్తూ కూర్చున్నాడు. తప్పులు దిద్దడం మొదలెట్టిన మాస్టారు "మొదట్లోనే తప్పా" అంటూ శౌరి చెవి మెలేశాడు. "'ఒక' అని చెప్పినప్పుడు "య, ర, ల, వ"ల్లో 'వ' వ్రాయకూడదని ఎన్నిసార్లు చెప్పాను"—గుడ్లురిమి చూశాడాయన. "ఓత్వం యిచ్చానండీ 'వ'కి" అన్నాడు శౌరి. "ఏడవలేకపోయావు" అన్నాడు మాస్టారు మిగతా దాంట్లో తప్పులు వెతుకుతూ.

"రంపము అని చెప్పినప్పుడు "బండిఱ" వ్రాయాలని చెప్పానా లేదా?" అడిగాడాయన.

"బండిఱ" మాత్రం శౌరికి ప్రాణ సంకటంగానే వుంది. "ఏ 'ర' రాస్తేనేం" అని సూటిగా అడిగాడు మాస్టార్ని. ఆయనకు పచ్చి వెలక్కాయ గొంతున పడినట్లయింది. తనకు ఏది తెలియదో సరిగా అదే అడిగాడు శౌరి, ఒక పొడుం పట్టు పీల్చి తేరుకుని "ఒరే అబ్బాయి! నేను చెప్పినట్లు వ్రాయడమే నీ పని. అడ్డదిడ్డం ప్రశ్నలు వేయకూడదు" అని ముందలించాడు. గురువుగారిని శౌరి మరే ప్రశ్నా వేయలేదు. తర్వాత లెక్కలు, సైన్సు, చరిత్ర, భూగోళం కూడా బోధించి మాస్టారు వెళ్ళిపోయాడు. ఒక పెద్ద పీడ విరగడయినట్లు నిట్టూర్చి శౌరి 'పిల్లల పత్రిక' చేతబుచ్చుకుని కథలు చదువుకుంటూ కూర్చున్నాడు.

ప్రయివేటు మాస్టారు వచ్చి వెళ్ళేలోగా సేతు ఓ కునుకు తీసి లేచాడు. మధ్యాహ్నం మూడయింది. అంతక్రితమే యింటికి వచ్చిన గౌరి అన్నగారికి, భర్తకు వేయించిన అటుకుల ఫలహారం పెట్టింది. ఓ గుప్పెడు అటుకులు నోట్లో పోసుకుని సేతు "చెల్లాయీ నువ్వు నిజంగా చూసివుండాల్సింది, మారుపేరుతో మేము 'సత్య హరిశ్చంద్ర' నాటకం వేస్తున్నాడు. నక్షత్రకుడి పాత్ర మనది. జనం విరగబడి చూశారంటే నమ్ము" అన్నాడు.

"అది సరేలేగాని నువ్వొక దారిలో ఎప్పుడు పడతావు" అని అడిగింది గౌరి.

"చూశావా బావా! నేను యింత [illegible] చేస్తున్నా యింకా దారిలో [illegible] టోంది చెల్లాయి. మనం గడిస్తున్న కీర్తి పత్రికలు చూస్తూంటే తెలుస్తుంది."

"ఔనౌను. అంతేలే'' అన్నాడు శేఖరం.

సేతు నుద్దేశించి "నిన్ను [illegible] కూడా బాగు చెయ్యలేడు" అంటూ గౌరి లోపలికి వెళ్ళింది. "నిన్నా అంతేలే అనుకున్నాడు గౌరిని గురించి శేఖరం మనసులో.

ఫలహారం అయ్యాక, మల్లు పంచె, సిల్కు లాల్చీ ధరించి, గొడుగు చేతబట్టుకుని అతు చెప్పులు తొడుక్కుని శేఖరం ఏదో [illegible] బయటికి వెళ్ళిపోయాడు. బావను పాతిక రూపాయ లిమ్మని అడిగేవాడే సేతు. కాని

## ఎవరి గొడవ వారిది!

*హరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్రయ్యా హరిశ్చంద్ర పాత్రధారి. ఆయన ఇంటి చాకలే నక్షత్రకుడుగా నటిస్తున్నాడు.*

*విశ్వామిత్రుని పనుపున వచ్చిన నక్షత్రకుడు విసుగుపుట్టి ఇలా ఇలా అరిచాడు :*

*"ఏమయ్యోయ్, హరిశ్చంద్రయ్యా! ఆ విశ్వామిత్రుని బాకీ తీర్చితే తీర్చావు, లేకపోతే లేదు. కాని నాకు ఇస్త్రీ బట్టల తాలూకు ఇవ్వవలసిన డబ్బులు మాత్రం ముందివ్వు."*

*—తిరువీధుల జగన్మోహనరావు*
(అద్దేపల్లి)

డబ్బు పెత్తనమంతా వెల్లాయిదేనని గుర్తొచ్చి వూరుకున్నాడు.

పార్టీకి వేళయితే గౌరిని తీరుబడిగా బెలిపించడం కుదరదని అతిథులు రావడానికి యింకో గంట వ్యవధి వుండగానే సేతు ఆ పనికి పూనుకున్నాడు. కాని ఆవేళ అతని పాచిక పారలేదు. గౌరి ఒక్క నయాపైస కూడా పింగించలేదు సరికదా పెట్టవల్సిన నాలుగూ పెట్టింది. ఆమె కరవచ్చినట్లు అనిపించి తోక ముడిచి యివతలికి వచ్చేశాడు సేతు. అంతలో శౌరి పట్టుకున్నాడు. "మామయ్యా సాయంత్రం అయింది. కథ చెబుతావా లేదా" అని. వీడో కడు ఎప్పుడు చూసినా కథలంటూ పీకుతాడు! ఆవేళ గౌరిమీదే కాదు శౌరిమీద కూడా అసంతృప్తి కల్గింది సేతుకు. ఎల్లాగా కథ చెప్పందే శౌరి వదలడని తెలుసుగా! మొదలెట్టాడు—

"పోయినసారి వచ్చినప్పుడు, ఆమె మొగుడి ముక్కు చెవులు కోసేసిందని కదూ చెప్పాను."

"ఔను మామయ్యా" అన్నాడు శౌరి.

అప్పుడే గోడమీద పాకుతున్న ఓ బల్లి సేతు కంటబడింది. అతని కథ ముందుకు సాగింది—

"ఆ మర్నాడు ఆమె పొయ్యి దగ్గర పకోడీలు వండుతూ కూర్చుంది. అప్పుడు పొయ్యి దగ్గర గోడమీద బల్లి పచార్లు చేస్తూ వుందిరా. దానికి పకోడీలంటే బలే యిష్టంలే. అప్పు డేమ్చెం దనుకున్నావ్. 'చుయ్' మనే చప్పుళ్ళు, కమ్మని పకోడీల వాసన తగిలేసరికి దానికి నోరూరింది. గోడమ్మటే పాకుతూ కిందికి కొంతదూరం దిగి వచ్చింది. పకోడీలు చేస్తున్న ఆమెకు బలే కోపం వచ్చిందిలే— బల్లి పకోడీలకోసం వస్తోందని. అప్పు డామె ఒక్క చూపు ఎల్లా చూసిందంటే దానికేసి— ఆ బల్లి తారెత్తిపోయి, కాళ్ళు పట్లూడి సల సల కాగుతున్న నూనెలో పడి తెగ కొట్టుకుందిలే."

"అయ్యో అయ్యో" అన్నాడు శౌరి. అతనికి వెంట్రుకలు నిక్కపొడిచాయి. కాని అతి శ్రద్ధగా వింటున్నాడు.

"ఆమె మాత్రం ఆ బల్లిని నూనెలోంచి తీయలేదురోయ్. అది కూడా పకోడీలతో వేగి వేగి పకోడీ అయిపోయింది"

"అరె" అన్నాడు శౌరి. చెప్పుకుపోతున్నాడు సేతు—

"వాళ్ళింట్లో ఓ చిన్ని అబ్బాయి వున్నాడు. "మరి నాకు పెత్తవా ఓ పకోడీ" అని అడిగాడురా పాపం! "నీకు అజీర్తిచేస్తుంది. పెట్టనం" దామె. ఆ పిల్లాడు పేచీ పెడుతూంటే ఆమె వాడిని రెక్క పుచ్చుకుని గిర గిరా తిప్పి మేడమీంచి విసిరేసిందిరోయ్."

"ఏమయ్యాడా అబ్బాయి" ఆత్రుతగా అడిగాడు శౌరి.

"ఏమోరోయ్. ఆ తర్వాత యిక నేను చూడలేక గట్టిగా కళ్ళు మూసేసుకున్నాను" అని తప్పించుకున్నాడు సేతు.

"అరెరె! నువ్వు పట్టేసుకోవల్సింది మామయ్యా పడిపోకుండా."

"ఆమె చూస్తే వూరుకుంటుంది(టా నన్నూ అల్లాగే విసిరేస్తే?" శౌరికి అదీ నిజమే ననిపించింది.

తాను డబ్బు యిమ్మన్నప్పుడు గౌరి కరిచినట్లెల్లా మాట్లాడిందో సేతుకు బాగా గుర్తుంది. కథ సాగించాడు—

"ఆ తర్వాత ఓ రోజున ఏమ్చెం దనుకున్నావు! ఆమె పార్కునుంచి తిరిగివస్తూంటే చెలగాటానికి ఓ కుక్కపిల్ల ఆమె పిక్కట్టుకుని కరిచి పారిపోబోయింది."

"బలేగా చేసింది" అని చంకలు కొట్టుకున్నాడు శౌరి.

"విను మరి. ఆమెకు అప్పుడు చాలా కోపం వచ్చింది. వెంటనే ఆమె ఒక్క అంగేసి వంగుని చేయి చాస్తూనే దాని తోక ఆమె చేతికి దొరికిపోయింది."

"అరెరె!" అన్నాడు శౌరి నివారిస్తూ.

"ఆపళంగా ఆమె దాన్ని అల్లాగే పైకెత్తి కటుక్కున దాని తోక కొరికేసింది."

"అమ్మ బాబోయ్" అన్నాడు శౌరి.

"గోలెట్టిపోయిందిలే కుక్క" అంటూ కథ ముగించాడు. సేతు.

"అప్పుడు నేనుంటే ఆమెను తన్నేద్దును" అన్నాడు శౌరి.

"ఒట్ఠి పిచ్చాడివిరా నువ్వు. ఆమె అంటే పెద్దాళ్ళకే భయం" అన్నాడు సేతు.

"ఎక్కడుంటుంది మామయ్యా ఆమె?"

"ఇక్కడే వుందిరా బాబూ" అన్నాడు సేతు.

"ఇక్కడే! నిజంగానే! అయితే ఏది మరి?" ఆశ్చర్యపడుతూ అడిగాడు శౌరి.

"నువ్వే కనుక్కో చూద్దాం" అంటూ ఈకల హ్యాట్ నెత్తిని పెట్టుకుని లేచి బయటికి వెళ్ళిపోయాడు సేతు. శౌరి బుర్రలో అన్వేషణ ప్రారంభమయింది.

పార్టీ వేళ కావస్తోంది. శౌరికి మొహం కడిగి, తలదువ్వి సూటు తొడిగింది గౌరి. వచ్చేవాళ్ళను ఆహ్వానించి కూర్చోబెట్టే పని శౌరికి వప్పజెప్పి తాను వేరే పనులు చూసుకుంటోం దామె.

ఎవరైనా తమ యింటికి వచ్చినప్పుడుగాని, లేక ఎవ రింటికైనా తాము వెళ్ళినప్పుడుగాని లేదా దారిలో పరిచయస్థు లెవరైనా ఎదురైనప్పుడు గాని, కరస్పర్శ ఎల్లా చెయ్యాలో నవ నాగరికత సూచించే ఫక్కీలో లేని చిరునవ్వు మొహంమీద తాండవ మాడిస్తూ,

తాంబూలములకు
యాలక్కాయ,లవంగము యిప్పుడు అక్కరలేదు.
రూచి RUCH
సుగంధ ద్రవ్య సముదాయము.
పచ్చకర్పూరం, కుంకు పువ్వు చేర్చబడినది.
అన్ని కిరాణా కొట్లలో దొరుకును.
కిళ్లీకొట్లలో వాడబడుచున్నది.
¼ పౌ. రు. 3—25, పోస్టేజి అదనం.
నానాకాస్మటిక్సు, విజయవాడ—2.

స్థాపితం1920
రెడ్డి అండ్ కో. (రిజిష్టర్డు)
గోపాలపురం తూ.గో.జిల్లా
కుష్ఠు బొల్లి మేహవాడ వగైరా చర్మ సుఖ వ్యాధులకు శాస్త్రీయ ప్రత్యేక చికిత్స.
ఆయుర్వేద ఔషధములు లభించును
→ కేటలాగు సలహా ఉచితము
బ్రాంచీలు: నెల్లూరు — కాపువీధి, సికింద్రాబాద్ — 3560 కింగ్సువే

డాక్టరు కండి
ఇంటో కూర్చుని, పోస్టల్ ట్యూషన్ ద్వారా. గవర్నమెంటు రిజిస్టరు కాలేజీనుంచి మీరు ఒక డిప్లమో పొందవచ్చును. ఫ్రీ ప్రాస్పెక్టస్‌కు వ్రాయండి.
Indian Homoeopathic College (A.W.P.) Jullundur City

హెడంజా


మూల వ్యాధులకు.
ప్రతి చోట దొరుకును

ఏ యే సందర్భాల్లో సరిగా ఏ యే మాటలు వాడాలో, ఒకవేళ నవ్వవల్సిన పరిస్థితే ఏర్పడి వప్పుడు సరిగా నోరు ఏపాటి తెరిచి నవ్వాలో ఒకవేళ ముక్కు చీదుకోవల్సివస్తే జేబు రుమాల్లో ఒబ్బిడిగా ఎల్లా చీదుకోవల్సింది— అవన్నీ శౌరికి అంతకుమునుపే నూరిపోసేసింది

## వాత్సల్యం

గౌరి. చిటికెనవేలు గోరు కొరుక్కుంటూ మరిచిన ఏ మర్యాదవు ముక్కనో జ్ఞాపకం తెచ్చుకుంటున్న శౌరిని బల్లమీద పెన్సిలుతో వేలిమీద ఒక్కటేసింది గౌరి— "వేళ్ళు అల్లా నోట్లో పెట్టుకోకూడదని ఎన్నిసార్లు చెప్పాను" అంటూ. శౌరి వేలు తీసేశాడు.

ఒక్కొక్కళ్ళే వస్తున్నారు **అతిథులు.** శౌరి ప్రస్తుతం వాళ్ళకు స్వాగతం చెప్పే పనిలో వున్నాడు. వస్తున్న ఒక్కొక్కళ్ళకే



చూసి అర్థంలేని చిరునవ్వు చిందించి, ఓ నమస్కార బాణం విసిరి, కుర్చీలవైపు వాళ్ళకు దారి చూపిస్తున్నాడు. అల్లాంటి సందర్భాల్లో శౌరికి నిజంగా ముళ్ళమీద నిలబడినట్లుంటుంది. కుర్చీల దగ్గరికి వెడుతూ ఒకామె నాజూగ్గా అతని బుగ్గ వేలుతో మీటింది. ఇంకో ఆమె అతని తల నిమిరి, పేరడిగింది. మరొకామె ముద్దెట్టుకుంది—ఎవరికి తోచిన మర్యాద వాళ్ళు చేశారు శౌరికి. అతను అడిగినవాళ్ళకల్లా తన పేరు 'శౌరి' అని అప్పటికి అనేకసార్లు చెప్పాడు. ఎన్నిసార్లో లేని చిరునవ్వు ప్రదర్శించాడు. "నువ్వు ఏం చదువుకుంటున్నావు" అని ఒకరు అడిగితే "నీకు ఏ పాటలు వచ్చు" అని అడిగేవాళ్ళు యింకొకరు.

వచ్చేవాళ్ళంతా వచ్చేసినట్లున్నారు. ఫలహారాలు ఆరగించడం మొదలయింది. శౌరి తెరిపినబడినట్లు నిట్టూర్చి మెల్లగా తండ్రి గదిలోకి జారుకుని అక్కడున్న ఓ కుర్చీలో కూలబడ్డాడు. ప్రమాదంతో కూడుకున్న సర్కసుఫీటు ఏదో చేసివచ్చినట్లుంది అతనికి. అతిథులలో ఒకామెకు ఎంత పెద్ద ముక్కు వుందో జ్ఞాపకం వచ్చి నవ్వుకో బోయాడు. కాని నవ్వురాందే! ఎల్లా వస్తుంది! చీటికి, మాటికి చిరునవ్వు తెగ ప్రదర్శించి మొహం కండరాలు అలిసిపోయాయి. అవి యిక చెప్పిన మాట వినలేదు.

పక్కయింటి వాళ్ల అబ్బాయితో గోళీలు ఆడుకోడానికి పోవాలనే వుంది శౌరికి. అంతకు ముందు రోజూ ఆ అబ్బాయితో కలిసి ఆడుకోనిచ్చేది తల్లి. కాని ఇటీవల ఆ అబ్బాయి తల్లితో ఆమెకు మాట మాట వచ్చిన దగ్గరనుంచీ శౌరి అక్కడకు వెళ్లితే కాళ్ళు విరగేస్తానన్నది. ఏం చెయ్యడానికి పాలుపోక అలమారుకేసి చూచిన శౌరికి మందు సీసా కంటపడుతూనే దాన్ని బద్దలు కొట్టేయాలన్నంత కోపం వచ్చింది. తాను తెల్లారి కళ్లు విప్పుతూనే, రోజూ అందులో మందు ఓ గ్లాసులో పోసుకొని త్రాగమని తయారవుతుంది తల్లి. ఎంత చేదో ఆమందు! కాని ఎంత యిష్టం లేకపోయినా తాను త్రాగడం తప్పదు. ఆమె అంతదగ్గరలో నిలబడి తను ఒక పట్టాన ఒప్పుకోలేని పనేదైనా చేయమని హుంకరిస్తున్నప్పుడు ఆమె ఎప్పుడు గుండె ఠంగుమనిపించేస్తుందో అని కావుదల కోసం నెత్తిమీదికి చేయి పోనిచ్చినా, లోపలినుంచి పుట్టుకొచ్చే ఆందోళన మూలంగా అతని బుర్ర అల్లాంటప్పుడు బొత్తిగా పని చేయడం మానేస్తుంది. అంత మరీ దగ్గరగా ఎందుకు నిల్చుంటుందో! కాస్త దూరంగా నిల్చుంటే! అదే శౌరికి చింతగా ఉంది.

శౌరి కుర్చీలోనుంచి లేచి కిటికీ దగ్గరకు వెళ్లి వీధిలో చోద్యాలుచూస్తూ నిలబడ్డాడు. కూడా ఉన్న పెద్దవాళ్లచేతులు పట్టుకుని, నడుస్తూ వెళ్లిన చిన్న చిన్న అబ్బాయిలు అమ్మాయిలు ఉండి ఉండి కనిపిస్తూ వచ్చారు. అల్లా గాలిలో తిరిగితే వాళ్ళకు ఎందుకు జబ్బుచేయదో అనుకున్నాడు శౌరి. గట్టిగా గాలి వీస్తున్నా, బాగా ఎండకాస్తున్నా, ఆకాశంలో మబ్బులు ఉన్నా, తల్లి ఎప్పుడూ తనను బయటికి వెళ్లనీయదు. జబ్బు చేస్తుందంటుంది. ఆమె చూడకుండా తాను ఆడుకోడానికి బయటికి చెక్కేసిన సందర్భాలు శౌరికి గుర్తున్నాయి. ఎప్పుడైనా తెలిస్తే మాత్రం తల్లి వీపు చీరేసేది.

దూరంగా ఓ చోట ఎవరో అబ్బాయి గూటీబిళ్ల జోరుగా కొట్టడం చూశాడు శౌరి. గిర గిరా తిరుగుతూ అది చాలాదూరం వెళ్లి పడింది. "బలే బలే" అనుకున్నాడు. తనను ఎప్పుడూ అల్లా ఆడుకోనీయదు తల్లి. అన్నింటికీ ఆమె యిష్టమే నంటుంది. తనెప్పుడైనా దగ్గరికి వెళ్లి మాట్లాడితే "విసిగించక"అని మొట్టికాయ వేసేస్తుంది. మరి ఆమె తన దగ్గరికివచ్చి మాట్లాడినప్పుడో! బలేకోపంగా ఉంది శౌరికి. ఆమె చెప్పినట్టల్లా తాను చెయ్యాలి. నవ్వమంటే వెంటనే నవ్వేసెయ్యాలి. లేకపోతే చక్కిలిగింతలు పెట్టి ఊపిరిఆడకుండా నవ్వించేస్తుంది. "అమ్మకు ఏం వచ్చినా కష్టమే" అనుకున్నాడు కిటికీ ఊచలు పట్టుకొని శౌరి.

ఇంతలో తల్లి పిలుపు వినిపించింది. నవనాగరికతకు వెన్నెముకలాంటి మర్యాదపు ముక్కలు మళ్లీ నెమరుకు తెచ్చుకుంటూ వెళ్ళాడు శౌరి. "వీడే మాఅబ్బాయి" అని మిత్రురాలు మిస్ జోన్స్‌కి పరిచయం చేసింది గౌరి.

"హౌడుయుడు" అంది మిస్‌జోన్స్ శౌరి బుగ్గ వేలుతో మీటి. శౌరికి అసలే ప్రాణం విసిగి ఉంది. "నేను వీళ్లకు ఆట వస్తువునా" అనుకున్నాడు. శౌరి ఏమీ మాట్లాడక పోయేసరికి "సిగ్గు స్వభావం కాబోలు" అంది మిస్ జోన్స్ ఇంగ్లీషులో. "శౌరీ మాట్లాడవేం?" అంది గౌరి. ఆమె కళ్లలో ఎరుపు శౌరికి సోకింది. కాని అతడు మాట్లాడలేదు. అతనిలో ఏదో తీవ్రంగా చెలరేగుతోంది.


"తినేటప్పుడు నువ్వుమాతో కూర్చోలేదే" అంది యింకోకామె.

"వాడికి ఆరోగ్యం సరిగా ఉండటం లేదు. మిఠాయి వగైరాలు తినకూడదని నేనే వద్దన్నాను" అంది గౌరి.

"ఇప్పు డే క్లాసు చదువుతున్నాడు?" అడిగింది యింకోఆవిడ.

వచ్చేఏడు పెద్దక్లాసులో జేర్పించే ఉద్దేశ్యంతో యింటి దగ్గర ప్రయివేటు చెప్పిస్తున్న సంగతి చెప్పింది గౌరి.

"ఆరోగ్యం సరిగా లేనప్పుడు అదే మంచి పద్ధతి" అని అంతా ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు.



ప్రణయజ్యోతి
చిత్రం—సైబ పరంధాములు
(నిజామాబాద్)

"నాకు ఒంట్లో ఫస్టుగా ఉంది" అని అప్రయత్నంగా అనేశాడు శౌరి.

ఒకరిమొహం ఒకళ్లు చూచుకున్నారు అక్కడికి వచ్చినవాళ్లు. శౌరి పద్ధతి ఎంత మాత్రం నచ్చలేదు గౌరికి.

"మాస్టారు దగ్గర ఏమి నేర్చుకుంటున్నావు" అని ఒకామె అడిగితే శౌరి చెప్పాడు.

"అయితే గంగానది ఎక్కడుందో చెప్పు చూద్దాం" అందామె.

"శివుడి నెత్తిమీద" అని తడుముకోకుండా చెప్పాడు శౌరి.

చచ్చినంతపని అయింది ఆ నవనాగరికులకు తేరుకునేసరికి.

"ఎవరు చెప్పారోయ్ నీకు యిలాంటి తప్పులు" అని షోగ్గా అడిగింది రంగద్దాలు పెట్టుకున్న ఒకామె.

"మా బామ్మగారు తప్పు చెప్పరు" అన్నాడు శౌరి అతినమ్మకంగా. గౌరికి ఎంతమాత్రం నచ్చలేదు శౌరి వ్యవహారం. కోపం దిగమింగుతూ కూర్చుంది. కొంతసేపయ్యాక జీతం పెరిగినందుకు శౌరిని అభినందించి ఒక్కొక్కళ్లే సెలవు తీసుకొని వెళ్లిపోయారు. వాళ్ళు వెడుతూనే "మట్టి బుర్ర" అంటూ గిద్దెడు నూనె కారేలా శౌరిని ఒక్కటి మొట్టింది గౌరి. ఎందుకో తెలియక ఆశ్చర్యం ఏడుపు ఒక్కుమ్మడిగా వచ్చాయి శౌరికి. "ఏడుపు వినిపిస్తే గొంతుక పిసుకుతాను" అంటూ గౌరి హాల్లోకి వెళ్లింది. ఆమె వెనకాలే మెల్లగా శౌరికూడా ఏడుపు అణుచు

(తరువాయి 49 వ పేజీలో)

# వాత్సల్యం

(19 వ పేజీ తరువాయి)

కుంటూ నడిచాడు. విద్యుద్దీపాల కాంతిలో ఎదురుగా గోడమీద పురుగులు పట్టుకుంటున్న బల్లిని చూస్తూ ఆగింది గౌరి. అది చూచిన శౌరికి ఏడుపు ఎగిరి పోయింది. మామయ్య చెప్పిన 'బల్లికథ' జ్ఞాపకం వచ్చింది. తల్లి ఏం చేస్తుందోనని ఓ మూల నిల్చుని కుతూహలంగా కనిపెట్టాడు.

"ఏదైనా వెనకనుంచి వచ్చి తోకపట్టుకుంటే, బల్లితోక విడిచి పారిపోతుం"దని వినడమేగాని గౌరి ఎప్పుడూ ప్రత్యక్షంగా చూడలేదు. బల్లిమీద స్కేలుబద్ద తీసుకుని గౌరి చురుగ్గా దాని తోక అదిమిపెట్టింది. బల్లి పైకి పారిపోయింది కాని స్కేలు తీస్తూనే తోకముక్క కిందపడి కొట్టుకోటం మొదలెట్టింది. నిజంగా బల్లి తోకను వదిలేసే వెళ్లిందో లేక దానితోక తెగిపోయిందో గౌరికి బోధపడలేదు. చూస్తూ నిల్చుంది. కొట్టుకుంటున్న తోకను చూడలేక శౌరి కండ్లు మూసుకున్నాడు. అతనికి బల్లిమీద జాలి, తల్లి అంటే భయం, అసహ్యం ఒక్కుమ్మడిగా కలిగాయి. మామయ్య కథలో ఆమె మరెవరూ కాదనే అనుమానం అతనిలో ధృవపడిపోతోంది. మహాభయం వేసింది. పిల్లిలా అడుగులిడుతూ అక్కడనుంచి వెళ్లి తండ్రిగదిలో ఓ మూల నక్కి కూర్చున్నాడు. కాసేపు పోయాక తల్లి పిలుపు విన్నాడు. ముచ్చెమటలు పోశాయి. వెళ్లకపోతే మరీ ప్రమాదం. లేచి వెళ్లాడు. కొడుకును చూస్తూనే పళ్లు పట పటలాడించి " నీ పనేనా ఇది" అంది కలం చూపిస్తూ గౌరి.

"ఏమిటి" అన్నాడు శౌరి భయపడుతూ.

"పాళీ నువ్వేనా పాడుచేస్తే?"

"ఉహూ, నేను దాన్ని ముట్టుకోందే?"

"నువ్వుకాక యింట్లో కలం మరెవరు తీస్తారు. నిజం చెప్తావా లేదా" అని కొడుకు జుట్టు పట్టుకుంది గౌరి.

మామయ్య కథ జ్ఞాపకం ఉంది శౌరికి. ఆమె చంపేస్తుందని తెలుసు. ప్రతిఘటించమని ఏదో తీవ్రంగా పురికొల్పిందతన్ని. ఎల్లాగో స్వాధీనం చేసుకొని ఆమె చేయి దొరికించుకుని, కసితీరా ఒక కాటు వేశాడు శౌరి. వెంటనే తట్టింది—'పుట్టాక ఎప్పుడూ చేయని పని చేశా'నని. తరుముకుని వస్తున్న తల్లికి దొరకకుండా తక్షణం వుడాయించి వేశాడు. పారిపోతున్న శౌరిని మామయ్య చెప్పినకథ మరీ వేగంగా పరిగెత్తించింది—కరిచాక పారిపోతున్న కుక్కనే కదా మరి ఆమె తోకట్టుకుని కరిచేసింది! అప్పుడే ఇంట్లో అడుగు పెడుతున్న తండ్రి ప్రక్కనుంచి బాణంలా దూసుక పోయాడు శౌరి. మెట్లమీంచి ఎక్కడ పడతాడో అని శౌరి వెళ్లిన వైపు ఆందోళనగా చూశాడు శేఖరం. 'సంగతేమిటని' అడిగాడు "అయిడిన్ ఎక్కడ" అని చిందులు తొక్కుతున్న భార్యను. ఆమె విరుచుకు పడింది—

"కనబడలేదూ! చేయికరచి పారిపోయాడు. వైనాలు అడక్కపోతే అయిడిన్ సీసా ఎక్కడుందో చూచి పెట్టకూడదూ?" "అది నువ్వు వెతుక్కున్నా దొరుకుతుందిలే! ముందు వాడెక్కడికి పోయాడో చూడనీ" అంటూ బయల్దేరుతున్న భర్తమీద మండిపడింది గౌరి.

"ఎక్కడికి పోతాడు వెధవ! కడుపులో కాలుతూనే తిరిగి రాడూ! ఇంతట్లోకే తమరు వెతకటానికి వెళ్లాలి కాబోలు!"

శేఖరం ఆమె మాటల్ని లక్ష్య పెట్టలేదు. శౌరి అతని మనస్సుకు ఆకలేస్తే తిరిగివచ్చే పిల్లాడిలా అనిపించలేదు. అదీకాక పిల్లలికి కావల్సిందీ, వాళ్ల అభివృద్ధికి తోడ్పడేదీ భోజనం ఒక్కటేనా! మరి పెంపకంసంగతి! గౌరికి ఆవిషయం ఎందుకు తోచదో అనుకుంటూ పై మీద కండువా వేసుకుని శౌరిని వెతకటానికి బయలు దేరాడు.

తిరిగి తిరిగి ఎక్కడా కనపడక శేఖరం తెల్లవారుతుండగా యింటికి వచ్చాడు. గౌరికిమాత్రం ఆ రాత్రి కంటిమీద కునుకెక్కడిది! కన్నకొడుకే గదా శౌరి. నిజానికి ఆమె శౌరి శ్రేయస్సు ఎంతగా కోరింది! పాడు పని చేశాడని కొట్టిందికాని. ఇంటికివస్తూనే "అబ్బాయి రాలేదూ" అడిగాడు శేఖరం. చిన్న పుచ్చుకున్న మొహంతో లేదన్నట్లు తలూపింది గౌరి.

అసలు శౌరిని ఎందుకు కొట్టిందో అడిగి తెలుసుకుంటూనే "ఓసి నిర్భాగ్యురాలా! శౌరి కాదే నీకలం పాడుచేస్తే" అన్నాడు శేఖరం.

పార్టీకి వచ్చినవాళ్లతో వచ్చిన చిన్న అమ్మాయి ఎవరో ఆ కలం తీసి యిష్టం వచ్చినట్లు గోడలనిండా వ్రాసేస్తుంటే అప్పుడే యింటికి వచ్చిన శేఖరం పాళీవంకరైన ఆకలం ఆ అమ్మాయి దగ్గరనుంచి తీసుకుని బల్లమీద పెట్టేశాడు. అతిధులంతా లోపల విందు ఆరగిస్తున్న సమయంలో పనికట్టుకుని భార్యను పిలిచి ఆసంగతి చెప్పడం భావ్యం కాదని మాట్లాడక వూరుకున్నాడు. పార్టీ హడావిడి తగ్గాక రావచ్చుగదా అని గౌరిని కలుసుకోకుండా వీధిగదిలోంచే మళ్లీ మెట్లుదిగి బయటికి వెళ్లి పోయాడు. సంగతంతా విన్నగౌరికి కత్తివాటుకు నెత్తురు చిలక్కలేదు మొహాన.


తగిలేది తప్పేది చూచుకోకుండా పరుగు తీస్తున్న శౌరిని ఒక కుక్కపిల్ల 'బోయ్ బోయ్' మంటూ వెంటాడింది. వేగం రెట్టించాడు శౌరి. కాని త్వరలోనే అలసి పోయాడు. వరుసగా నిల్చిఉన్న కొన్ని బస్సుల దగ్గరికి వచ్చి ఆగాడు. వాటిలో పిన్నలు పెద్దలు అనేకమంది ఎక్కుతున్నారు. వగరుస్తూ దడదడ కొట్టుకుంటున్న గుండెలతో త్వరగా ఓ బస్సులోకి ఎక్కి కూర్చున్నాడు కుక్కబారినుంచి తప్పించుకోడానికి. ఆ తర్వాత శౌరికి ధైర్యం చాలలేదు కుక్క యింకా బయటఉందో పోయిందో చూడ్డానికి.

బస్సులు బయల్దేరాయి. అవి ఎక్కడికి పోతున్నాయో అతనికేం తెలుసు! ఆ అబ్బాయి ఎవరనే ప్రసక్తి ఎవరికీ రాలేదు. ఎందుచేతనంటే అందులో ఎక్కిన పెద్దలకు తమ తమ పిల్లల్ని చూచుకోడం తోనే సరిపోయింది. అవి పెళ్లికి కంట్రాక్టు తీసుకున్న బస్సులు. అందుకనే టిక్కెట్లు అడిగేవాడు కూడా లేకపోయాడు. ఇల్లు దూరమైపోతుందని మొదట్లో కొంత దిగులు కలిగినా ఒక వేళ తక్షణం తనను బస్సులోంచి దింపేసినా, ఇంటికి వెళ్లే ధైర్యం తనకు ఎల్లాగా లేదని శౌరికి తెలుసు. అనేకరోడ్లు మళ్లి వేగంగా పోతున్న బస్సులో ధైర్యా ధైర్యాల మధ్య కొట్లాడుతున్న మనస్సుతో చప్పుడు కాకుండా కూర్చున్నాడు శౌరి. వెనక్కు జరిగి పోతున్న రోడ్డుకు యిరుప్రక్కల ఉన్నచెట్లు వాటివెనుక చీకట్లు శౌరిలో తెలియని బెంగ కల్గించాయి. చెట్లు అడ్డురానప్పుడు ఆకా



"నా గడ్డం గీసుకునే కత్తి ఇలా బండగా అయిపోయిందేం?"

"బాగుందండోయ్! నాకేం తెలుసు—నిన్న పనసకాయ చెక్కిన కత్తి ఈవేళ గడ్డం గీయకపోవడమేమిటో!"



**పేరూరులో శిల్పం**

ఫోటో—ఎస్. జి. శేషగిరి (కోయంబత్తూరు-6)

శంలో కనిపిస్తూ వచ్చిన నక్షత్రాలు అతని లేత హృదయం అలసట దీర్చి, అస్పష్టమైన ఆశలు రేపాయి.

చివరికి పెండ్లి జనాన్ని తీసుకుని వెడుతున్న ఆ బస్సులు ఒక గ్రామంచేరి పెండ్లివారింటి దగ్గర ఆగాయి. అందరితోబాటు శౌరి కూడా దిగాడు. డాక్టరు చలపతిరావుగారి పెద్ద కుమార్తె వివాహం అది. బ్రహ్మాండంగా జరిగింది. పెళ్లి సందడిలో శౌరి బలేహాయిగా గడిపాడు. ఇష్టంవచ్చినట్లు తినితిరిగాడు. తన యీడు వాడే అయిన డాక్టరుగారి చిన్న అబ్బాయి వేణుతో అతనికి బలే స్నేహం కలిసింది.

వివాహం, దానికితోడుగా వుండే ఇతర ముచ్చట్లు ముగిసిన మర్నాడు మగ పెళ్లివారు పిల్ల మేకతోసహా బయల్దేరి వెళ్లిపోయారు. సరిగా అంతకు ఓ గంటముందే శౌరి, వేణు కలిసి పొలం వెళ్లారు ముంజికాయలు తిన


# వాత్సల్యం

డానికి. పెళ్లికి వచ్చిన చుట్టాలు పక్కాలు కూడా పల్సబడ్డారు ఒకళ్ళిద్దరుతప్ప. రెండు రోజులయ్యేసరికి వాళ్ళూ వెళ్లిపోయారు. మిగిలిపోయిన బంధువల్లా శౌరి ఒక్కడే. అప్పుడొచ్చింది అతని ప్రసక్తి. 'ఎవరబ్బాయి అంటే ఎవరబ్బాయి' అనుకున్నారు డాక్టరుగారూ, ఆయనభార్యా. ఎవరి అబ్బాయి వని చలపతిరావుగారు అడుగుతూనే ఏడుపు లంకించుకున్నాడు శౌరి. తానెవరో చెప్పేస్తే తల్లితండ్రుల దగ్గరికి పంపించేస్తారని భయం. "ఈ అబ్బాయి పెళ్లికి వచ్చిన వాళ్ల ఎవరి తాలూకో అయివుంటాడు. రేపోమాపో వచ్చి వాళ్ళు ఎల్లాగా తీసుకపోతార"నే దీమాకొద్దీ డాక్టరు దంపతులు ఆసంగతి అట్టే పట్టించుకోలేదు. కాని పెళ్లి అయి నెల రోజులు కావస్తున్నా ఎవరూ రానూలేదు. శౌరిని తీసుకెళ్లనూ లేదు. పరిస్థితి చిత్రంగానే తోచింది చలపతిరావుగారికి. అయినా ఆయన గాని, ఆయనభార్యగాని ఆ చిన్నవాడికి ఏ లోటూ చేయలేదు.

తెల్లారిన దగ్గరనుంచీ చలపతిరావుగారింటికి అనేకమంది వస్తూ పోతుంటారు అనేక పనులమీద. ఒకసారి ఏదోపనిమీద శౌరివూరి నుంచే వచ్చిన ఒక పెద్దమనిషి చలపతిరావు గారితో తన స్వగ్రామం ఫలానా అని చెబుతూ ఉంటే అదివిన్న శౌరికి గుండె ఆగిపోయి మళ్లీ కొట్టుకొంటున్నట్లయింది. ఒక రోజున చల పతిరావుగారింట్లో జరుగుతున్న పూజ 'గౌరీ పూజ' అని విన్నప్పుడు కూడా అల్లా అయింది శౌరికి. కాని రాను రాను రోజులు గడిచిన కొద్దీ అతని కొక ధైర్యం ఏర్పడింది తల్లి తనను యిక ఎంతమాత్రము పట్టుకోలేదని. శౌరి వచ్చి అప్పుడే నెలదాటింది. ఆ నెల్లాళ్లలోనూ అతడు పొందుతూ వచ్చిన హాయి పుట్టాక ఆదివర కెన్నడూ అతడు పొంద లేదు. మామయ్య చెప్పిన కథలన్నీ వేణుకు చెప్పాడు శౌరి. వేణుతో అతని స్నేహం విడిచి ఉండలేనన్నంతవరకు వచ్చింది. ఇద్దరూ కలిసి ఇష్టంవచ్చినట్లు ఆడుకునేవారు. పొలాలు, తోటలు, దొడ్లు, కాలవగట్లు— వాళ్లు తిరగని చోటంటూ లేదు. దాగుడు మూతాల దగ్గరనుంచి కోతికొమ్మచ్చిదాకా వాళ్లు ఆడని ఆటంటూ లేదు. శౌరికి జీవితంలో లోటు తీరిపోయినట్లే ఉంది.

ఒక సాయంత్రం చలపతిరావుగారి ఇంటి ఆవరణంలో పిల్లలంతాచేరి ఆడుకుంటున్నారు. వేణుమాత్రం ఇంట్లో ఎక్కడోవున్నాడు. కంచాలోకి మాటిచూసి శౌరి ఉండేలు బద్దలా వెనక్కులాగి పట్టుకున్న వేలుతో గోలీని పరుగెత్తించాడు. ఇంతలో అతని దృష్టి ప్రక్కనే ఉన్న పాదాల మీద పడింది. తలెత్తి చూస్తూనే కెవ్వునకేకపెట్టి బిగిసి పోయాడు. గౌరి అల్లావచ్చి నిల్చుంటుందని అతడు కలలోకూడా అనుకోలేదు.

"దూరంగా పో వాడిదగ్గరనుంచి. నీ మొహం చూపించకు వాడికి" అని అరిచాడు శేఖరం. ఆశ్చర్యపోయింది గౌరి. తనను చూసేనా కన్నతండ్రి మూర్ఛపోవడం! నమ్మలేక పోయింది. చలపతిరావుగారికి పరిస్థితి ఏమీ అర్థం కాలేదు. అడుగలేదు గాని 'సవతితల్లేమో' అని మాత్రం అనుకున్నాడు. తన విధ్యుక్తధర్మం నెరవేర్చడంలో ఆయన ఎంతమాత్రం ఆలస్యం చేయలేదు. పిల్లాడిని గదిలోనికి తీసుకెళ్లి పడుకోబెడుతూనే ఇంజెక్షన్ చేశాడు. ఒక పావు గంట ఆగి పరిస్థితి చూసి మరొక ఇంజెక్షన్ కూడా చేశాడు. ఎంతసేపూ శౌరి తల్లితండ్రులు ఎంత దుఃఖిస్తున్నారోననేగాని చివరికి పరిస్థితి



కాళహస్తి దృశ్యం    ఫోటో — కె. వెంకటరావు (మద్రాసు-17)

యిలా పరిణమిస్తుందని చలపతిరావుగారు వూహించలేకపోయారు. ఇల్లా జరుగుతుందని తెలిస్తే పనికట్టుకుని నగరంవెళ్లి శౌరి తలితండ్రుల్ని ఎందుకు తీసుకొస్తాడు! అసలు వేణు చెప్పకపోతే అతని తల్లిదండ్రులసంగతి ఆయనకు తెలియకపోను.ఒక వేళ స్నేహం కొద్దీ వేణుతో చెప్పిఉంటాడనే ఉద్దేశ్యంతో కొడుకుని అడిగితే తెలిసింది. ఒక రోజున కాలవలో పల్లెవాళ్లు చేపలు పట్టుతూంటే చూస్తూ కూర్చున్న శౌరి, వేణు అడిగితే సంశయిస్తూ చెప్పాడు తన తల్లిదండ్రుల వివరం. ఆసంగతి ఎవరికీ చెప్పనని వేణుచేత ఒట్టు వేయించుకొని మరీ చెప్పాడు. కాని ఆఒట్టు సంగతే మరిచాడు వేణు తండ్రితో ఆ విషయం చెప్పినప్పుడు.

తెలివి వచ్చేసరికి శౌరి ఒళ్ళు జ్వరంతో కాలిపోతోంది. కళ్లు విప్పుతూనే తలనిమురుతూ కూర్చున్న తండ్రిని చూశాడు. గుమ్మం దగ్గర నిల్చిఉన్న గౌరి మెల్లగా రెండడుగులు ముందుకువేసి ఆత్రంతో తొంగి చూచింది. ఆమె అక్కడున్నట్లు గ్రహించిన శౌరి ఒళ్లు భయంతో గుబుల్పొడిచింది. అదిగమనించిన గౌరి దూరంగా గుమ్మం దగ్గరికి వెళ్లింది. కొంతసేపటికి బాధగా మూలిగి "అమ్మ నన్ను ఉత్తుత్తినే కొడితే. . నేను. ." అని సంజాయిషీ చెప్పుకోబోయిన కొడుకును బుజ్జగిస్తూ "అవును బాబా అమ్మను కొట్టేదాం" అన్నాడు శేఖరం. కొంచెంసేపు పోయాక శౌరి నీరసంగా అన్నాడు. "నన్ను వూరకే కొడుతూంటే అమ్మను మీరు ఏమీ అనరు." శేఖరం మాట్లాడలేదు. కన్నీళ్లు మాత్రం తుడుచుకున్నాడు. రహస్యంగా తండ్రితో అన్నాడు శౌరి—" నాన్నగారూ, నన్ను వదలిపెట్టి మీరెక్కడికి వెళ్లొద్దు. నాకు భయం వేస్తోంది. అమ్మ చంపేస్తుంది."

"భయపడకు బాబా నేనున్నానుగా" అన్నాడు తండ్రి. అంతే. ఆతర్వాత కొన్ని క్షణాల్లో పాటుంది శౌరి తెలివి. బాధతో మూలిగి పక్కకు ఒత్తిగిలిన దగ్గరనుంచి శౌరికి ఇక మన స్పృహ లేదు. రాత్రి పది దాటేసరికి పరాకు మాటలు మొదలయ్యాయి. శౌరిని ఒడిలో పెట్టుకుని కూర్చున్నాడు శేఖరం.

"అమ్మో! నేను రాను. ఇక్కడే ఉండిపోతా. నన్ను పోనీయకు వేణూ" అని ఉండి ఉండి పలవరిస్తున్నాడు శౌరి. అబ్బాయి మనస్సు దెబ్బ తిందన్నారు చలపతిరావుగారు. చేతనైన వైద్యం ఆయన చేస్తూనే ఉన్నారు. ఇంకో గంటకు తెల్లవారుతుందనగా "వేణూ నన్ను లాక్కుపోతున్నారు. పోనీయకు, పోనీయకు" అని అరిచి శాశ్వతంగా కళ్లు మూశాడు శౌరి. అతనిచేతినే ఉన్న వేణు యిచ్చిన బొమ్మల గడియారం చిన్నబుచ్చుకున్నట్లుండి ఒక వింత దు:ఖం కలిగించింది. ఏడవలేక శేఖరం ఒక్క పెద్ద నవ్వునవ్వాడు. గౌరి నమ్మలేకపోయింది. ఆత్రంగా కొడుకు దగ్గరికి రాబోయిన ఆమెను చేయి వూపి వారించాడు శేఖరం. అతనికి పిచ్చెక్కిపోయింది. "అమ్మా! మళ్లీ మా శౌరిని కొట్టడానికా వస్తున్నావు" అన్నాడు కొడుకును ఒడిలో దాచేసుకుంటూ—

గౌరి కన్నకడుపు తీపితో ఒక్క వెర్రి చూపుచూచి "అదేమిటి!.... అల్లాఒదిలేస్తారేం నావెర్రితండ్రిని!" అంది ఆత్రంగా.

(సమాప్తం)